సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 26 । జూలై । 2025



కల్లు డిపోపై దాడి
గద్వాల జిల్లాలో అనుమతి లేని కల్లు డిపోపై అధికారులు మెరుపు దాడి చేశారు.

వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన వరద
జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద 80 వేల క్యూసెక్కులకు పెరిగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.7 /21.1

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం
నాగర్‌కర్నూల్ క్రైం: డయల్ **యువర్ డీఎం** కార్యక్రమాన్ని శనివారం **నిర్వహిస్తున్నట్లు** డిపో మేనేజర్ యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రయాణికులు, ప్రజలు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సెల్ నం.7382446772కు ఫోన్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి
నాగర్‌కర్నూల్: మున్సిపాలిటీలోని దుకాణ యజమానులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ట్రేడ్ లైసెన్స్ కోసం రూ.1,93,125 చెల్లించిన ప్రగతి హాస్పిటల్ వారికి మున్సిపల్ సిబ్బంది ట్రేడ్ లైసెన్స్ ధ్రువపత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని దుకాణ యజమానులు ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి ట్రేడ్ లైసెన్స్ తీసుకొని పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, వార్డు ఆఫీసర్ సాయిరాం, సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమాపై అవగాహన కల్పించాలి




వెల్దండ: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న జీవిత, ప్రమాద బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి డివిజన తపాలా పర్యవేక్షకులు భూమన్న అన్నారు. శుక్రవారం ఆయన వెల్దండ పోస్టాఫీసును పరిశీలించి మాట్లాడారు. తపాలా బీమాతో ఖాతాదారుల కుటుంబాలకు ధీమా కల్పిస్తుందన్నారు. పోస్టాఫీసుల ద్వారా అందిస్తున్న పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువగా లాభం వచ్చేవి కేవలం తపాలా శాఖలోనే ఉన్నాయన్నారు. పోస్టాఫీసుల్లో వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే పొదుపు, రికరింగ్ డిపాజిట్లు, ఆడపిల్లలకు సుకన్య యోజన పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. 8 ప్రైవేట్ కంపెనీలతో కలిసి తక్కువ ప్రీమియం చెల్లించి పెద్ద మొత్తంలో బీమా పొందే పథకాలను పోస్టాఫీసు ద్వారా అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీపీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది రతన్‌నాయక్, రాజేందర్ రెడ్డి, పుష్పగిరి, శ్రీనునాయక్, సత్యం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగడాలకు అడ్డుకట్ట పడేనా?

జనరల్ ఆస్పత్రి వద్ద ప్రైవేట్ అంబులెన్స్ వాహనదారుల ఇష్టారాజ్యం

- అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే రూ.వేలు చెల్లించాల్సిందే
- సిండికేట్‌గా మారి నిలువుదోపిడీకి యత్నం
- అప్‌గ్రేడ్ అయినా అందుబాటులోకి రాని ఉచిత అంబులెన్స్ సేవలు



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రి వద్ద ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకుల ఆగడాలు మితిమీరుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు, రోడ్డు ప్రమాద బాధితులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే ప్రైవేటు అంబులెన్స్‌ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బాధితుల నుంచి రూ.వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఏర్పాటు తర్వాత జిల్లా ఆస్పత్రిగా, మెడికల్ కళాశాల రాకతో జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా ఉచిత అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనరల్ ఆస్పత్రిలో ఒకే ఉచిత అంబులెన్స్ ఉండటంతో అందరికీ సేవలు అందలేకపోతున్నాయి.

సిండికేటుగా మారి..

జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల నుంచి జనరల్ ఆస్పత్రికి ప్రతిరోజు 800 మంది వరకు వస్తుంటారు. అయితే రోడ్డు ప్రమాద బాధితులను మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తుండటంతో ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ప్రైవేటు అంబులెన్స్‌ల యజమానులు సిండికేటుగా మారి బాధితుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు అంబులెన్స్‌ల సిండికేట్‌లో భాగంగా ప్రతిరోజు కొన్నింటికి మాత్రమే అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు ఎవరైనా తమను ఆశ్రయిస్తే వారు నిర్ణయించిన రేటుకే వెళ్లాలి.. లేదంటే మరో అంబులెన్స్ రాదు. ఈ క్రమంలోనే ప్రైవేటు అంబులెన్సుల్లో మహబూబ్‌నగర్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లాలంటే రూ.4 వేలు, హైదరాబాద్‌కు అయితే రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. కాగా.. ఎవరైనా చికిత్సకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతిచెందితే అదనంగా మరో రూ.4 వేలు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.



జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి ఎదుట ప్రైవేటు అంబులెన్సులు

ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది..

జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది ప్రైవేటు అంబులెన్సులను ఏర్పాటు చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో రెఫర్ చేసే వారిని తమ అంబులెన్స్‌లలో తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నారు. దీంతోపాటు చాలారోజులుగా అంబులెన్స్‌ల దందాపై అధికారులకు సమాచారం ఉన్నా వివిధ వర్గాల ఒత్తిళ్లతో అటు వైపు చూడటం లేదు.

నిబంధనలు పాటించట్లే..
ప్రాణాపాయస్థితిలో ఉన్న క్షతగాత్రులు, రోగుల కుటుంబ సభ్యులతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న ప్రైవేటు అంబులెన్సుల యజమానులు మోటారు వాహన చట్టాల నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. క్షతగాత్రులను తరలించే క్రమంలో అంబులెన్సులను ఎవరు ఆపరనే ఆలోచనతో సరైన పత్రాలు లేకపోవడంతోపాటు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో జిల్లా రవాణా శాఖ అధికారులు వీటిపై దృష్టిసారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత సేవలు కల్పిస్తాం..



జనరల్ ఆస్పత్రి నుంచి అత్యవసర సమయంలో రెఫర్ అయ్యే బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తాం. అలాగే ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది ప్రైవేటు అంబులెన్స్‌లను ఏర్పాటు చేసుకుని రోగులను తరలిస్తున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– ఉషారాణి, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

వాటిని సీజ్ చేస్తాం..



జిల్లాలోని ప్రైవేటు అంబులెన్సులకు సరైన పత్రాలు లేకపోవడంతోపాటు ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపైకి తీసుకువస్తే సీజ్ చేస్తాం. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే జిల్లాలోని ప్రైవేటు అంబులెన్స్‌లను తనిఖీ చేస్తాం. మోటారు వాహన నిబంధనలను పాటించని అంబులెన్సులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– చిన్న బాలు, జిల్లా రవాణా శాఖాధికారి

దోపిడీని అరికట్టాలి..



జనరల్ ఆస్పత్రిలో ప్రైవేటు అంబులెన్స్‌లు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ అత్యవసర పరిస్థితిలో ఉన్నవారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాగే ఇక్కడ మృతిచెందిన వారి మృతదేహాలను సమీప గ్రామాలకు తీసుకువెళ్లాలన్నా రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. జనరల్ ఆస్పత్రిలో ఉచిత అంబులెన్సు సేవలు ప్రారంభించి సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– నజీర్, నాగర్‌కర్నూల్

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పక్కన ఏఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో చోరీలు, ఇతర నేరాల నివారించేందుకు ఎంతగానో ఉపయోగపడే సీసీ కెమెరాలను ప్రతిఒక్కరు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, పెంట్లవెల్లి మండలాలకు సంబంధించిన బంగారు, ఫైనాన్స్ వ్యాపారులు, బ్యాంకు మేనేజర్లకు సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకూ చోరీలు పెరిగిపోతున్నాయని, ప్రతిఒక్క షాపు, ఫైనాన్స్ ఆఫీసులు, బ్యాంకులకు 360 డిగ్రీలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఎన్వీఆర్‌తోపాటు క్లౌడ్‌లోనూ రికార్డు అయ్యే విధంగా చూసుకోవాలని, సీసీ కెమెరాలకు అలారం వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి నేరాలనైనా ఆపగలిగే శక్తి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేటప్పుడు ముందు భాగంలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా కవరయ్యే విధంగా రెండు కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా ఎక్కడైనా చోరీలు జరిగినప్పుడు నేర పరిశోధనకు పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లాలో చోరీలను నియంత్రించేందుకు ఒక డీఎస్పీ, ముగ్గురు ఎస్‌ఐలతో ప్రతిరోజు నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకుంటామని వివరించారు. సమావేశంలో ఏఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం



బిజినేపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

- ఈ ఏడాది 199 స్కూళ్లలో ఏర్పాటుకు నిర్ణయం
- విడతల వారీగా అన్ని బడుల్లో అమలుకు చర్యలు
- జిల్లాలో డిజిటల్ బోధనకు లభించనున్న ఊతం

నాగర్‌కర్నూల్: కంప్యూటర్ ఆధారిత విద్యకు రాన్రాను ప్రాధాన్యత పెరగుతుండటంతో విద్యార్థులను ఆ దిశగా సిద్ధం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పించేలా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రణాళికలను సైతం రూపొందించింది. దీంతో ఈ సంవత్సరం నుంచే విద్యా బోధన కొత్త పుంతలు తొక్కనుంది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు సదుపాయం ఉన్న పాఠశాలలకు ఇప్పటి వరకు ఈ వెసులుబాటు లేకపోవడం వల్ల కొన్నిచోట్ల ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్ ఇంటర్‌నెట్ ద్వారా కంప్యూటర్ విద్యను బోధిస్తున్నారు. అయితే ఇంటర్‌నెట్ వేగం సరిపోకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంతే కాకుండా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగించవద్దన్న నిబంధనలను సైతం విధించడంతో కంప్యూటర్ విద్యకు మరింత ఆటంకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీతోపాటు ఇతర అంశాల్లో అధిక ప్రాధాన్యత ఉండనుండటంతో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా పాఠశాలలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చాలా ఉపయోగం..
ప్రభుత్వ పాఠశాలల్లో బ్రాడ్ బ్యాండ్ సేవలను ప్రారంభించడం వల్ల విద్యార్థులకు డిజిటల్ బోధనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మొదటి విడతలో 199 పాఠశాలల్లో ఈ సేవలను ప్రారంభించనున్నారు. విడతల వారిగా మిగతా పాఠశాలలకు కూడా ఈ సేవలు అందనున్నాయి.

– రమేష్‌కుమార్, డీఈఓ

మొదటి విడతలో..
జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు కలిపి 841 ఉండగా.. వీటిలో బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించనున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు ద్వారా విద్యార్థులకు డిజిట్ పాఠాలు బోధించాలంటే ఇంటర్‌నెట్ తప్పనిసరి. అయితే మొదటి విడతలో 199 ఉన్నత పాఠశాలలకు మాత్రం ఈ ఏడాది నుంచి ఈ సేవలు ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేసి పంపగా.. త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. తర్వాత విడతల వారిగా మిగతా పాఠశాలలకు సైతం ఈ సేవలను విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ సదుపాయాలతో విద్యార్థులకు సంబంధించిన డిజిటల్ బోధన మెరుగుపడనుంది. రానున్న పోటీ ప్రపంచంలో ప్రైవేటు విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పడాలంటే ఈ సౌకర్యాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాలక్ష్మి విజయవంతం సదస్సుకు డీఎం యాదయ్య అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, విద్యార్థులు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో వివరించారు. పలు పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభచాటిన వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బాధ్యతలు చేపట్టిన వెంటనే మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించారన్నారు. 200 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సంస్థకు రూ.6,680 కోట్లు చెల్లించిందని వివరించారు. వంటింటికే పరిమితమైన మహిళలు ఈ పథకం ద్వారా ఇతర ప్రాంతాలకు వెళ్లి చిరు వ్యాపారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు పెట్రోల్ బంకుల నిర్వహణతోపాటు బస్సులను కొనుగోలు చేసేందుకు రుణాలు సైతం మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బలోపేతం కావడంతోపాటు మహిళలు కూడా ఆర్థికంగా ప్రయోజకులుగా మారుతున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిమ్మాజిపేట, నాగర్‌కర్నూల్ పట్టణం, మండలం, తెలకపల్లి మండలాలకు చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

కొల్లాపూర్ రేంజ్‌లో 5 పెద్దపులులు

- పులుల జాడలు గుర్తించిన అటవీ అధికారులు

\- కొల్లాపూర్



వివరాలు 8లో ▸

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

చారకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిచాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక జెడ్పీహెచ్‌ఎస్, సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. విద్యా ప్రమాణాలపై తరగతి గదిలో పరీక్షించారు. విద్యార్థులు మరింత శ్రద్ధ వహించి చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని చెప్పారు. విద్యాభ్యాసంలో ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. మెనూ ప్రకారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలే భవిష్యత్‌కు దిక్సూచిగా నిలబడాలని, అందుకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతోపాటు, మెరుగైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్ నర్సింహ, ఎంఈఓ ఝాన్సీరాణి, కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

- పదవీ విరమణ పొందనున్న ఉద్యోగులకు త్వరగా పేమెంట్ ఆర్డర్ అందజేతకు చర్యలు
- రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్
- ప్రిన్సిపల్, అకౌంటెంట్ జనరల్, కలెక్టరేట్ సంయుక్త ఆధ్వర్యంలో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్
- పెన్షన్, జీపీఎఫ్, అకౌంట్ సమస్యలపై వర్క్‌షాప్ విజయవంతం




మాట్లాడుతున్న రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందాపండిత్, పక్కన కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ ఫైనల్ విత్ డ్రాయల్ కేసుల సత్వర పరిష్కారానికి పెన్షన్ అదాలత్ నిర్వహించి పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్‌ఈ), కలెక్టరేట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్‌లో కలెక్టర్ విజయేందిరతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్లు, జీపీఎఫ్ అందజేతలో ఏమైనా సందేశాలు ఉంటే అదాలత్‌లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ పత్రాలు, సాధారణ భవిష్య నిధి పత్రాలు అందిన వెంటనే వాటిని పరిశీలించి మంజూరు ఉత్తర్వులు అందిస్తామన్నారు. ప్రభుత్వ శాఖలలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్, జీపీఎఫ్ ఫైనల్ విత్ డ్రాయల్ ఉత్తర్వులు అందేలా ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ పింఛన్ ప్రభుత్వ ఉద్యోగుల హక్కు, పదవీ విరమణ చేసిన రోజున ఉద్యోగులకు పెన్షన్ ఉత్తర్వులు అందేలా చూడాలన్నారు. ఉద్యోగ బాధ్యతలతోపాటు ఆర్థిక నిర్వహణ కూడా ఇది ముఖ్యమన్నారు. అలాగే పెన్షన్ అదాలత్ ఏర్పాటు చేసి పెన్షన్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేసిన వారి పెన్షన్ పత్రాలు, జీపీఎఫ్ ఫైనల్ పత్రాలు సత్వరమే ఏజీకి పంపించాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సమస్యలను అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కాగా.. పెన్షన్ అదాలత్‌లో 116 ప్రభుత్వ శాఖల అధికారులు, 50 మంది పెన్షనర్లు, 28 మంది చందాదారులు, పెన్షనర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాలు, ప్రొసీడింగ్స్ అందజేత..
ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌తో కలిసి కలెక్టర్ 20 మందికి పెన్షన్ మంజూరు పత్రాలు, 16 జీపీఎఫ్ ఆథరైజేషన్ ప్రొసీడింగ్స్‌లను రిటైర్డ్ ఉద్యోగులకు అందజేశారు. 10 పెండింగ్ పెన్షన్ కేసులను పరిష్కరించారు. ఉదయం పెన్షన్ అదాలత్ తర్వాత మధ్యాహ్నం పెన్షన్, జీపీఎఫ్, అకౌంట్ సంబంధిత సమస్యలపై నిర్వహించిన వర్క్‌షాప్ విజయవంతమైంది. ఈ సందర్భంగా పెన్షన్ మంజూరు అధికారులు, పెన్షన్ జారీ, పంపిణీ అధికారులకు మార్గదర్శకాలు వివరించి అవగాహన కల్పించారు. అకౌంట్ సంబంధిత సమస్యలు చేసే తప్పుల గురించి వివరించారు. సమావేశంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్- వీఎల్‌సీ) నరేష్‌కుమార్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఎన్ టైటిల్‌మెంట్స్) అభయ్ అనిల్ సోనార్కర్, వనపర్తి, గద్వాల అదనపు కలెక్టర్లు యాదయ్య, నర్సింగ్‌రావు, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటినుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

- ఉమ్మడి జిల్లాలో 2 రోజుల పాటు కార్యక్రమాలు
- భారీ ఏర్పాట్లు చేస్తున్న పార్టీ శ్రేణులు



పాలమూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచందర్‌రావు నియామకం అయిన తర్వాత తొలిసారిగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించనున్నారు. శని, ఆదివారాల్లో నియోజకవర్గాల్లో పర్యటించి జిల్లా స్థాయి నేతలతో పాటు కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించనున్నారు. తొలిసారిగా ఉమ్మడి జిల్లాకు వస్తున్న క్రమంలో ఆయా జిల్లాలో పార్టీ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట రామచందర్‌రావు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జడ్చర్లకు చేరుకుంటారు. అక్కడ పాలమూరు బీజేపీ శాఖ, బీజేపీ శ్రేణులు స్వాగతం పలుకుతారు. తర్వాత మహబూబ్‌నగర్‌లోని అప్పన్నపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి.. అక్కడి నుంచి భారీ బైక్ ర్యాలీతో అన్నపూర్ణ గార్డెన్‌కు చేరుకుంటారు. అక్కడ జిల్లా, నియోజకవర్గ, మండల, బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు నారాయణపేట జిల్లా మరికల్, నారాయణపేటకు వెళ్లి.. వివిధ వర్గాల నాయకులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. రాత్రికి గద్వాల జిల్లాకేంద్రానికి చేరుకుని అక్కడే బస చేస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రెస్‌మీట్, ఆ తర్వాత మేధావులు, వివిధ వర్గాల నేతలతో సమావేశం నిర్వహించి.. 10 గంటలకు పెబ్బేరు, ఆ తర్వాత వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రాల్లో కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారు.

క్లుప్తంగా

అటవీ ప్రాంతంలో వ్యక్తి అదృశ్యం


లక్ష్మణ్

మన్ననూర్: శ్రీశైలం – హైదరాబాద్ ప్రధాన రహదారి నల్లమల అటవీ ప్రాంతం సరిహద్దులో వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలిలా.. గురువారం రాత్రి రహదారి గుండా పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో లంబడోని ఉతార్ అనే అటవీ సరిహద్దు ప్రాంతంలో ఒక ఆటో నిలిచి ఉండటాన్ని అటవీ శాఖ అధికారులు గమనించారు. కొంత సమయం వరకు అక్కడే ఉండి పరిశీలించగా ఎంతకు సంబంధిత వ్యక్తులు ఎవరు కూడా రాకపోవడంతో ఆటోను మన్ననూర్ దుర్వాసుల చెరువు వద్ద ఉన్న అటవీశాఖ చెక్‌పోస్టు ప్రాంగణానికి తరలించారు. అయితే, ఆటోలో లభించిన ఆధారాలను బట్టి అదృశ్యమైన వ్యక్తి శ్రీశైలం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణ్‌గా భావించారు. అయితే, శుక్రవారం ఉదయం సదరు వ్యక్తి బంధువులు చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. గత కొంత కాలంగా లక్ష్మణ్ తరచూ ఆందోళన చెందుతూ.. మతి స్థిమితం కోల్పోయినట్లుగా ప్రవర్తించేవాడని, ఈ క్రమంలోనే ఇక్కడికి వచ్చి ఉండవచ్చునని అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ గిరి మనోహర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది అటవీ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే సెల్ నం .8985778286కు లేదా అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

అచ్చంపేటలో బిహార్ పోలీసులు



అచ్చంపేట రూరల్: సైబర్‌క్రైం నేరారోపణల నేపథ్యంలో శుక్రవారం అచ్చంపేటలో బిహార్ పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్‌ఐ విజయ భాస్కర్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన వెంకటరమణ ప్రధాన రహదారికి ఎదుట బాలాజీ మెడికల్ దుకాణం నిర్వహిస్తున్నారు. అతడి కుమారుడు డొంగరి అనిరుధ్ ఉన్నత విద్యనభ్యసించి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. బిహార్‌లో రూ.2 కోట్ల వరకు పలువురి అకౌంట్ల నుంచి తండ్రి వెంకటరమణ, నల్గొండ జిల్లా కోదాడకు చెందిన భార్య అకౌంట్లకు మళ్లించడంతో కేసు నమోదైంది. నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి, బంధువుల ఇళ్లలో సోదాలు జరిపినట్లు ఎస్‌ఐ వివరించారు. గతంలో చెన్నై, బెంగుళూరు పోలీసులు కూడా వచ్చి విచారణ చేపట్టారని తెలిపారు. సుమారు రూ.9 కోట్ల వరకు పలువురు అకౌంట్ల నుంచి డబ్బులు దారి మళ్లినట్లు వివరించారు. బిహార్ డీఎస్పీతో పాటు సీఐ, ఎస్‌ఐ స్థాయి అధికారుల బృందం గాలించినప్పటికీ అనిరుధ్ ఆచూకీ లభించలేదని ఎస్‌ఐ తెలిపారు. మరోసారి సోదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

మద్యం దుకాణంలో చోరీ

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని యుఆర్ లిక్కర్‌మార్ట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ హరి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని పెబ్బేరు రోడ్డులోని యుఆర్ లిక్కర్ మార్ట్‌ను మూసి సిబ్బంది ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు లిక్కర్ మార్ట్ పైకప్పు కట్ చేసి లోపలికి దిగి రూ.2.08 లక్షల నగదు చోరీ చేశారు. ఘటనపై మార్ట్ క్యాషియర్ జయబ్రహ్మం శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అనుమతి లేని కల్లు డిపోపై దాడి


అదుపులోకి తీసుకున్న వ్యక్తులతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం

- 468 లీటర్ల కల్లు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు..
- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడితో జిల్లాలో అలజడి

గద్వాల క్రైం: ఎలాంటి అనుమతులు లేకుండా.. గుట్టుగా కొనసాగుతున్న కల్లు డిపోపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం మెరుపుదాడి చేసింది. దాదాపు 468 లీటర్ల కల్లు, 100 కేజీల చక్కెర, 10 కేజీల ఈస్ట్ (కల్లు తెలుపు రంగు కోసం వాడే పదార్థం) రెండు బైక్‌లు స్వాధీనం చేసుకోవడంతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గోనుపాడు గ్రామ శివారులోని శెట్టి ఆత్మకూర్ రోడ్డు మార్గంలో ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా కల్లు డిపోను కొనసాగిస్తున్నారు. ఈ డిపోను గుండ్రాతి సాంబశివగౌడ్, లక్సిసాని కిషోర్, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్ నడుపుతూ.. తయారు చేసిన కల్లును మోటార్ సైకిళ్లపై చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయాలు చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం కల్లుడిపోపై దాడి చేశారు. అయితే దాడులు చేపట్టిన క్రమంలో కల్లు తయారీకి వినియోగించిన చక్కెర, ఈస్ట్ పదార్థం, కల్లు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా తయారు చేసిన కల్లును సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపించారు. క్లోరో హైడ్రేడ్ (సీహెచ్), డైజోఫాం, ఆల్ఫ్రోజోలం వంటి మత్తు పదార్థాలతో కల్లును తయారీ చేశారా లేదా అనే విషయాలను ల్యాబ్‌కు పంపించిన శాంపిల్స్ ఫలితాల ఆధారంగా గుర్తించనున్నారు. పట్టుబడిన ముగ్గురు నిందితులపై ఎక్సైజ్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేశామని అధికారి తెలిపారు.

గోప్యంగా..

ఎలాంటి అనుమతి లేకుండా గోనుపాడు శివారులో కల్లు డిపోను కొన్ని నెలలుగా నిర్వహిండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం గురువారం రాత్రి దాడి చేసింది. అయితే దాడి చేపట్టిన విషయాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారులు ధ్రువీకరించలేదు. అనంతరం మీడియా వాకబు చేయగా సీఐ గణపతిరెడ్డి అధికారికంగా దాడుల సమాచారంపై ప్రకటన విడుదల చేశారు. ఇదిలాఉండగా, జిల్లా పరిధిలో ఎక్సైజ్, డీటీఎఫ్ సిబ్బంది నిత్యం తనిఖీలు చేపడుతుండగా వారికి ఈ డిపో విషయం తెలియదా.. లేక రాజకీయ ఒత్తిళ్లు, ఇతరాత్ర నజరానాలు అందడంతో చూసీచూడనట్లు వదిలేశారా అన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రసాయన పదార్థాలతో తయారుచేసే కల్లుతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా కూడా ఉక్కుపాదం మోపడంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు విఫలమయ్యారని.. దాడి విషయాన్ని గోప్యంగా ఉంచడం ఏమిటని పలువురు గీత కార్మికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధిత కల్లుగా అనుమానం..?

నడిగడ్డలో నిషేధిత కల్లు మాఫియాకు ముందు నుంచి నాయకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రమాదకరమైన రసాయనాలతో కల్లును తయారు చేసి విక్రయిస్తున్నారు. 2024 జులై 24వ తేదీన గద్వాల, మల్దకల్ మండలాల్లో నార్కోటిక్ అధికారులు దాడి చేసి నిషేధిత కల్లును స్వాధీనం చేసుకొని 20 మందిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కింద నాలుగు కేసులు నమోదు చేశారు. సరిగ్గా ఏడాది తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేయడం గమనార్హం. ఇదిలాఉండగా, ఈ అనుమతి లేని కల్లు విక్రయాలు, దందా నిర్వహిస్తున్న వ్యక్తులు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారిని ప్రసన్నం చేసుకొని యథేచ్ఛగా దందా నిర్వహిస్తారని సమాచారం. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న కల్లు సైతం నిషేధిత కల్లు అయ్యి ఉండవచ్చనే అనుమానం వ్యక్తమవుతోంది.

'పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలి'


మాట్లాడుతున్న ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

నారాయణపేట: రైతులు సంక్షోభం నుంచి బయటపడాలంటే పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) నారాయణపేట జిల్లా ప్రథమ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి, పంట పెట్టుబడిపై 50 శాతం అదనంగా మద్దతు ధర చెల్లించాలన్నారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము మాట్లాడుతూ.. తమ పంటలకు గిట్టుబాటు ధర రాకపోతే దాన్ని నిల్వ చేసుకొనేలా రైతులకు అసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. దేశంలో దాదాపు 54 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలో నట్టే విధంగా ప్రధాని నరేంద్రమోదీ విధానాలు ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు భగవంతు, కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, కృష్ణయ్య, సహాయ కార్యదర్శులు కొండ నర్సిములు, నారాయణ, బాలకృష్ణ, వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సలీం, సీపీఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు రాములు, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సౌజన్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రేంజ్‌లో 5 పెద్దపులులు



పులుల జాడలు గుర్తిస్తున్న అటవీ సిబ్బంది, అంకిల్‌పెంట ఏరియాలో సంచరిస్తున్న పెద్దపులులు

పులుల జాడలు గుర్తించిన అటవీ అధికారులు

కొల్లాపూర్: కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో 5 పెద్దపులులతోపాటు 2 చిన్నపిల్లలు ఉన్నట్లు రేంజర్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం అంకిల్‌పెంట ఏరియాలో నాలుగు పెద్దపులుల జాడలు గుర్తించామని వెల్లడించారు. వాటి జాడలు గుర్తించిన సిబ్బందిని డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి, ఎఫ్‌డీఓ చంద్రశేఖర్ అభినందించారని తెలిపారు. సీసీ కెమెరాల్లో కూడా వాటి కదలికలు నమోదయ్యాయని వివరించారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పులుల సంతానోత్పత్తి సమయమన్నారు. ఈ సమయంలో అడవిలోకి మనుషులు వెళ్లడం ప్రమాదకరమన్నారు. మనుషుల అలికిడి గమనిస్తే పులులు వారిపై దాడులు చేసే ఆస్కారం ఉంటుందన్నారు. వన్యప్రాణుల రక్షణకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. పులుల జాడలు గుర్తించే కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు ముజీబ్‌ఘోరీ, శివ, నీలేశ్, కిరణ్, నాగార్జునగౌడ్, శ్యామ్, నవీన్, లిఖిత తదితరులున్నారు.

హత్యకేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ క్రైం: హత్య కేసులో ఓ వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదు జైలు శిక్షతోపాటు జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. మహ్మద్ సిద్దిఖుల్లాఖాన్ అనే వ్యక్తి 18నెలలుగా జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో ఉన్న నయాబ్ హోటల్లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్య సమస్యలతో హోటల్‌లో పనికి వెళ్లకపోవడంతో అతని దగ్గర ఖర్చులకు డబ్బుల్లేక 2023 ఆగస్టు 20న న్యూటౌన్‌లో పండ్లు విక్రయించే సయ్యద్ ఖదీర్ వద్ద సెల్‌ఫోన్ విక్రయించి రూ.2వేలు తీసుకున్నాడు. ఆగస్టు 21న ఉదయం నుంచి వైన్‌షాప్ దగ్గర మద్యం తాగి సాయంత్రం ఖదీర్ వద్దకు వెళ్లి రూ.200ఇవ్వాలని అడిగాడు. దీనికి ఖదీర్ సెల్‌ఫోన్ ఛార్జర్ ఇస్తే.. డబ్బులు ఇస్తానని చెప్పాడు. అదే సమయంలో 16ఏళ్ల బాలుడు షహేరియార్ అహ్మద్ అక్కడికి వచ్చి నాకు ఇవ్వాల్సిన రూ.500ను తిరిగి ఇవ్వాలని మహ్మద్ సిద్దిఖుల్లాఖాన్‌ను అడిగాడు. దీంతో అతను ఇప్పుడు పనికి వెళ్లడం లేదు.. నా దగ్గర డబ్బులు లేవని..పనికి ఎక్కిన తర్వాత ఇస్తానని చెప్పాడు. అప్పుడు మహ్మద్ సిద్దిక్ ఉల్లాఖాన్ ఫోన్ విక్రయించిన సయ్యద్ ఖదీర్‌తో నా ఫోన్‌ను షహేరియార్ అహ్మద్‌కు ఇచ్చి షాషాబ్‌గుట్టలో ఉండే తన రూం వద్దకు పంపాలని చెప్పాడు. దీంతో సాయంత్రం 6గంటల ప్రాంతంలో రూం వద్దకు వెళ్లిన మృతుడు బాలుడు ఛార్జర్ తీసుకున్న తర్వాత తనకు ఇచ్చే రూ.500ఇవ్వమని చెప్పి అతని జేబులో ఉన్న రూ.300తీసుకున్నాడు. దీంతో నా జేబులో నుంచి డబ్బులు తీసుకుంటావా నిన్ను చంపితే రూ.500తో పాటు సెల్‌ఫోన్ మిగిలి పోతాయని భావించి బాలుడు రెండు చెంపలపై కొట్టడంతోపాటు గొంతునులిమి హత్యచేశాడు. ఆ తర్వాత భయంతో సెల్‌ఫోన్, ఛార్జర్ అక్కడే వదిలేసి హైదరాబాద్ పరారయ్యాడు. ఈ హత్యపై కేసు నమోదు చేసి ఛార్జిషిట్ దాఖలు చేసిన టూటౌన్ పోలీసులు ఈ కేసు శుక్రవారం కోర్టుకు రావడంతో ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి నేరస్థుడికి జీవిత ఖైదుతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నేరస్థుడికి జైలు శిక్ష పడేవిధంగా కృషి చేసిన టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, సిబ్బందితోపాటు కోర్టు సిబ్బందిని ఎస్పీ జానకి అభినందించారు.

హిందువుల ఐక్యతే లక్ష్యం


మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

వనపర్తిటౌన్: హిందువులందరినీ ఒకే నినాదం, ఒకే విధానంలోకి తీసుకురావాలని, అందుకోసం హిందూవాహిని పని చేస్తుందని హిందూవాహిని ద్విరాష్ట్ర అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో హిందూ ప్రముఖులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరు కులాలను పక్కనబెట్టి మనమంతా ఒక్కటే అనే భావనను చాటిచెప్పే సమయం ఆసన్నమైందని.. వంశపారంపర్యంగా వస్తున్న కులవృత్తిని గౌరవిస్తూ పర మతాలకు అవకాశం ఇవ్వకుండా మనకంటూ స్థానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బ తీయడానికే కొన్ని శత్రు దేశాలు పన్నిన కుట్రలో భాగంగా హిందూ అమ్మాయిలను టార్గెట్ చేస్తూ ప్రేమ, బెస్టీ అనే కొత్త కొత్త సంబంధాలతో ట్రాప్ చేస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో ఎలాంటి యుద్ధాలు, ఆటంకాలు వచ్చినా ఏకమై ఎదుర్కొనేలా ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూవాహిని రాష్ట్ర ఆర్గనైజర్ ముడుపు యాదిరెడ్డి, రాష్ట్ర సహ సంయోజక్ హరిచంద్రారెడ్డి, విభాగ్ కన్వీనర్ అభిలాష్, జిల్లా కన్వీనర్ అరుణ్‌గౌడ్, కో–కన్వీనర్లు శ్రీకాంత్, నవీన్, పట్టణ కన్వీనర్ నంద, నాయకులు మూర్తి, సంతోష్, నీలేష్, కార్తీక్, భరత్, సంతోష్, నిఖిల్ సాయి, హిందూవాహిని కార్యకర్తలు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో పదోన్నతులు

జనరల్ ఆస్పత్రిలో అసోసియేట్ విభాగంలో భారీగా ఖాళీలు

పాలమూరు: వైద్యశాఖలో అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా జనరల్ ఆస్పత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ఇప్పటికే రెగ్యులర్ వైద్యులు లేక రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉన్న వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించి ఇతర జిల్లాలకు బదిలీ చేయడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. జనరల్ ఆస్పత్రికి కొత్తగా వైద్యులు రావడానికి సుమారు 15 రోజుల సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

■ ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న 12 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించి పలు జిల్లాల జనరల్ ఆస్పత్రులకు బదిలీ చేశారు. ఈఎన్‌టీ విభాగంలో పని చేస్తున్న శ్రీకాంత్, ఫార్మకాలజీ డా. సృజనకు ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించగా.. ఆ ఇద్దరూ మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలోనే విధులు నిర్వర్తించనున్నారు. అదేవిధంగా ఇతర జిల్లాల నుంచి జనరల్ సర్జరీ విభాగానికి ప్రొఫెసర్‌గా డా. రంగ, గైనిక్ విభాగానికి ప్రొఫెసర్‌గా ప్రసన్నలక్ష్మి రానున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారిలో కొందరు మరో 15 రోజుల్లో జిల్లా జనరల్ ఆస్పత్రిలోని పలు విభాగాలకు రానున్నారు. ప్రధానంగా జనరల్ మెడిసిన్‌లో పనిచేసే అసోసియేట్‌లు అందరూ బదిలీపై వెళ్లడంతో ఆ విభాగంలో సీనియర్ వైద్యులు లేకుండా అయ్యారు. దీంతో అధిక ఓపీ, అడ్మిట్ కేసులు ఉండే జనరల్ మెడిసిన్‌లో వైద్యుల కొరత ఏర్పడటంతో సమస్యలు ఉత్పన్నం కానున్నాయి. అదేవిధంగా చిన్నపిల్లల విభాగంలోని ముఖ్యమైన వైద్యులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇంకా ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ప్రతి విభాగంలో ఖాళీలు ఏర్పడ్డాయి.

జూరాలకు పెరిగిన వరద

- ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాక
- 12 క్రస్టు గేట్ల ఎత్తి.. దిగువకు 85,391 క్యూసెక్కుల విడుదల


జూరాల నుంచి 12 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు/ రాజోళి/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా పెరిగింది. గురువారం ప్రాజెక్టుకు 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు 80 వేల క్యూసెక్కులకు పెరిగిందని పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్టు గేట్లను ఎత్తి 48,504 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 34,227 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 530, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 200, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 45 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.415 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ ఇదిలా ఉండగా.. ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గింది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 32,932 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 42,500 క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో దిగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 43,488 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో..

సుంకేసుల డ్యాంకు శుక్రవారం ఎగువ నుంచి 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో 7 గేట్లను తెరిచి 34,488 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్ 1,847 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు శుక్రవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 345.156 మిలియన్ యూనిట్లు సాధించారు.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం సముద్రమట్టానికి పైన 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 200 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 786 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 18 క్యూసె క్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 745 క్యూ సెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

ఎస్‌ఎల్‌బీసీ దుర్ఘటనకు ఐదునెలలు

- గల్లంతైన 8మందిలో నేటికీ లభించని ఆరుగురి ఆచూకి
- సొరంగం తవ్వకానికి ప్రభుత్వం సన్నద్ధం
- మిగిలిన 9.559 కి.మీ. పనుల పూర్తికి అడుగులు
- నేల స్వభావం అంచనాకు ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే!


దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం

అచ్చంపేట: దోమలపెంట శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ)ఇన్‌లెట్ సొరంగం పైకప్పు కూలిన ఘటనకు నేటితో ఐదు నెలలు పూర్తవుతుంది. ఫిబ్రవరి 22న సొరంగం పైకప్పు కూలిన ఘటనలో అక్కడ పనిచేస్తున్న 8మంది కార్మికులు చిక్కుకోగా ఇద్దరి మృతదేహాలను మాత్రమే వెలికితీశారు. 66రోజులపాటు కొనసాగిన అన్వేషణలో సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్ విడిభాగాలు కత్తిరించి, మట్టి, బండరాళ్లను బయటకు తరలించారు. మిగిలిన ఆరుగురి కోసం విస్తృతంగా గాలించిన వారి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. గల్లంతైన కార్మికుల జాడ కోసం చేపట్టిన విస్తృత గాలింపు చర్యల తర్వాత ప్రభుత్వం సహాయక చర్యలను నిలిపివేశారు. నల్గొండ జిల్లాకు 3.50లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లెట్ (దోమలపెంట) శ్రీశైలం జలాశయం నుంచి ఆరంభం అవుతుంది. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి ఔట్‌లెట్ వరకు మొత్తం 43.930 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఇన్‌లెట్ సొరంగం వైపునుంచి 13.930 కిలోమీటరు వద్ద టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) సొరంగం తవ్వుతుండగా పైనుంచి ఉబికి వచ్చిన నీటి ఉధృతికి పైకప్పు కూలడంతో చివరి వరకు వెళ్లిన కార్మికులు అందులో చిక్కుకున్నారు. నీటి ప్రవాహంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడడంతో డీ–1 నిషేధిత ప్రాంతం మినహా కాంక్రీట్ సెగ్మెంట్లు, బండరాళ్లు, బురద మట్టిని తొలగించినా గల్లంతైన కార్మికుల ఆచూకీ లభించలేదు.

12సంస్థల సహకారంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన రెస్క్యూ బృందాలు సొరంగం కుప్పకూలిన నాటి నుంచి శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను బయటకు తెచ్చేందుకు ఎంతో శ్రమించి రెస్క్యూ ఆపరేషన్ చేశాయి. ఇందులో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఆర్మీ, దక్షణ మధ్య రైల్వే, నేవీ, ర్యాట్‌హోల్ మైనర్స్, హైడ్రా, ఎస్‌ఆర్‌ఎస్, జీఎస్‌ఐ, ఎన్‌జీఆర్‌ఐ, రోబోటిక్ కంపెనీ వంటి 12సంస్థలకు చెందిన 800మంది కార్మికులు మూడు షిఫ్టుల్లో 24గంటలు పనిచేశాయి. అత్యాధునిక యంత్రాలు, పరికరాలను ఉపయోగించారు. మానవ శేషాలను గుర్తించేందుకు స్నీపర్ డాగ్స్, క్యాడవర్ డాగ్స్‌ను కేరళ నుంచి రప్పించారు. జేపీ కంపెనీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, గిరిజన సంక్షేమశాఖలు వివిధ సేవలు అందించాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సొరంగం సందర్శించి పర్యవేక్షించారు.

43మీటర్ల వద్ద నిలిచిన సహాయక చర్యలు

ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి సొరంగం తవ్వకాలను ముందుకు కొనసాగించడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) హెచ్చరించిన నేపథ్యంలో 13.930కిలోమీటర్ల వెనక్కి 43మీటర్ల శిథిలాలను తొలగించలేదు. ప్రమాద స్థలంలో శిథిలాలను తొలగించేందుకు సహాయక బృందాలు డీ–1, డీ–2 ప్రదేశాలుగా గుర్తించి శిథిలాలు తొలగించారు. డీ–2, డీ–1 ప్రదేశం వరకు 281 మీటర్ల తవ్వకాలు పూర్తికాగా అత్యంత ప్రమాదకరమైన నిషేధిత ప్రాంతంలో తొలగింపు పనులు నిలిపివేశారు. నిషేధిత ప్రదేశంలో పేరుకుపోయిన మట్టి, బురద, బండరాళ్లు కదిలిస్తే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని అధ్యయన కమిటీ తేల్చింది.

9.55 కిలోమీటర్ల సొరంగం కోసం..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. 43.930 కిలోమీటర్ల సొరంగానికి..ఇన్‌లెట్ వైపు నుంచి 13.930 కిలోమీటర్లు, ఔట్‌లెట్ మన్నెవారిపల్లి వైపు నుంచి మరో 20.430 కిలోమీటర్ల చొప్పున ఇప్పటివరకు 34.710 కిలోమీటర్ల మేర పనులు పూర్తికాగా.. ఇంకా 9.559 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. ఈ సొరంగాన్ని ఇప్పటి వరకు రెండు టీబీఎంల సహాయంతో రెండువైపులా(ఇన్‌లెట్, ఔట్‌లెట్) నుంచి తవ్వుకుంటూ వచ్చారు. ఇన్‌లెట్ వైపు సొరంగం ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఐదునెలలుగా పనులు నిలిచిపోయాయి.

అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో..

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకం పనులు పునరుద్ధరణకు చ ర్యలు చేపడతామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే వెల్లడించా రు. జాతీయ భౌగోళిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్‌ఐ), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్‌ఐ)సహకారంతో మిగిలిన 9.559 కిలోమీటర్ల సొరంగ మార్గం పనులు సత్వరమే పూర్తి చేసేదిశగా అడుగులు వేస్తున్నారు. సొరంగం ప్రాంతంలోని నేల స్వభావాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక హెలికాప్టర్లతో ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే చేయించాలని ప్రభు త్వం నిర్ణయించింది. అందుకు తక్కువ ఎత్తు లో ఎగిరే సామర్థ్యం గల రక్షణ శాఖకు చెంది న రెండు హెలికాప్టర్లు వినియోగించనున్నా రు. సర్వే పరికరాలను డెన్మార్క్ నుంచి ప్రత్యేకంగా తెప్పించనున్నారు. ఎలక్ట్రోమ్యాగ్నటిక్ పరికరాలతో జరిపే సర్వే భూ ఉపరితలం నుంచి కిలోమీటర్ లోతు వరకు నేల స్వభావంతో పాటు ఇతర సమాచారాన్ని అందిస్తోంది. పనుల్లో ఎలాంటి అవాంతరాలు రాకుండా ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్తల సహకారంతో ఏరియల్ లైడార్ సర్వేను చేయించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సొరంగం నిర్మాణంలో అనుభవం కలిగిన ఆర్మీ మాజీ ఈఎన్సీ హర్పాల్ సింగ్‌ను సలహాదారుడిగా, కల్నల్ పరీక్షిత్ మెహ్రాను స్పెషల్ సెక్రటరీ హోదాలో రెండేళ్లపాటు నియమించారు.